# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 20-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.**

2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన టిడిపి పార్లమెంటరీ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి**

3. **రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు.**

4. **ఏలూరు జిల్లాలో వరద ప్రభావిత గ్రామాలలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పర్యటించారు.**

==========================

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి పెరుగుతోంది. బ్యారేజీలోని 175 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 3,46,391 క్యూసెక్కుల మిగులు జలాలను అధికారుల సముద్రంలోకి విడుదల చేశారు.

అనకాపల్లి జిల్లాలో కల్యాణపులోవ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లవద్దని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సూచించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలోని విద్యా సంస్థలన్నింటీకి సెలవు ప్రకటించారు.

. అల్లూరిసీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం రామరాజుపాలెం వద్ద వంతెనపై వరద ప్రవహిస్తుదండంతో కేడీపేట-చింతపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు వట్టిగెడ్డ జలాశయం పొర్లుకాలువ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజ్‌కు భారీగా వరద పోటెత్తింది. బ్యారేజ్ నుంచి కాల్వల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వర్షాల కారణంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఉండవల్లిలోని ఆయన నివాసంలో తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ సమావేశం ఈ రోజు మధ్యాహ్నం జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్ర ప్రాధాన్య అంశాలైన అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, దక్షిణ కోస్తా రైల్వేజోన్లో వివిధ ప్రాజెక్టులకు భూముల కేటాయింపు, అపరిష్కృత అంశాల పరిష్కారం, విశాఖ ఉక్కు పరిశ్రమ, విభజన హామీలు వంటి అంశాలపై చర్చించనున్నామని టిడిపి నాయకులు తెలిపారు. అలాగే పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్లమెంట్ సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలు జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభమవనున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖల సన్నద్ధతపై శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ తో పాటు ఇతర అధికారులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 22 నుంచి 5 రోజులపాటు సమావేశాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని సజావుగా సాగేందుకు వీలుగా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశాల సమయంలో పెద్దసంఖ్యలో బయటి వ్యక్తులకు అనుమతి లేదని, తగిన ధృవీకరణ ఉన్నవారినే అనుమతించనున్నట్లు తెలిపారు. శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఫలవంతమైన చర్చలతో ప్రజలందరికీ మేలు జరిగేలా ఉభయ సభల నిర్వహణ సాగాలన్నారు. అందుకు ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఏలూరు జిల్లాలోని మన్యం ప్రాంతమైన కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాలను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సందర్శించారు. ప్రస్తుతం చేపడుతున్నసహాయక చర్యలు, పరిస్థితులపై అధికారుల్ని మంత్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరదల సమయంలో ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని సూచించారు. విద్యుత్ అంతరాయం, భారీ చెట్లు విరగడంతో రవాణా అంతరాయం కలిగితే అధికారులకు సమాచారం అందించాలన్నారు. అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులు ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండి రైతులకు అండగా నిలవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్. ఢిల్లీరావు వ్యవసాయాధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు సాగు చేసేందుకు వీలుగా అధిక దిగుబడులనిచ్చే మేలైన వంగడాలను సిద్ధంగా

ఉంచుకోవాలన్నారు. సాంకేతిక నైపుణ్యాలపై రైతులకు అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా విస్తరణ కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం ఈ శిక్షణా కేంద్రాన్ని మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉద్యోగులతో ఆయన సమావేశమై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, అచ్యుతాపురం శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం 3000 మంది నైపుణ్య శిక్షణ పొందుతున్నారన్నారు. 5000 మందికి శిక్షణ పెంచాలన్న ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర హోంమంత్రి వి.అనిత తెలిపారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఈరోజు ఉదయం రాష్ట్ర హోంమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు రంగనాయకుల మండపంలో మంత్రికి వేద ఆశీర్వచనాలు చేయగా అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. తిరుమలలో సామాన్య భక్తులకు అవసరమైన సౌకర్యాలను టిటిడి కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

అల్పపీడన ప్రభావంతో గడచిన 48 గంటల నుండి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో నమోదైన వర్షపాతం, వాతావరణ పరిస్థితుల పై ఆకాశవాణి గుంటూరు ప్రతినిధి రవిశంకర్ మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తావిభాగంలో కాజ్యువల్ బ్రాడ్కాస్ట్ అసిస్టెంట్గా పనిచేసేందుకు విజయవాడలో నివసించే అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ వార్తావిభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విశాఖపట్నం పార్ట్టైమ్ కరస్పాండెంట్గా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు ప్రసారభారతి.జీవోవీ.ఇన్, న్యూస్ఆన్ ఎయిర్.జీవోవీ.ఇన్ వెబ్సైట్లలో అందుబాటులో ఉంటాయని, మరిన్ని వివరాలకు 9440674057 నెంబర్ను సంప్రదించవచ్చని తెలిపారు.

---------------------------

సాంకేతిక లోపాలతో పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా విశాఖపట్నం విమానాశ్రయం నుంచి పలు పౌర విమానయాన సేవలను ఈరోజు రద్దు చేస్తున్నట్లు అధికార వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

ఇండిగో విమానయాన సంస్థకు చెందిన 9 విమాన సేవలను నిలిపివేసినట్లు తెలిపారు. హైదరాబాద్ – విశాఖపట్నం – హైదరాబాద్ విమానాన్ని నిలిపివేయగా, బెంగళూరు – విశాఖపట్నం, చెన్నై – విశాఖపట్నం విమాన సేవలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాల్సిందిగా విమానాశ్రయ అధికారులు కోరారు.

-------------------------

ఈనెల 28వ తేదీన ప్రసారం కానున్న మన్ కీ బాత్ ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో సలహాలు, సూచనలు రావడం పట్ల సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ తన ప్రసంగంలో ప్రస్తావించవలసిన అంశాల గురించి తనకు అసంఖ్యాకంగా సూచనలు లభిస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా సమాజాన్ని పరివర్తనం చేసేందుకు చేస్తున్న సమిష్టి ప్రయత్నాలగురించి మాట్లాడవలసిందిగా యువత సూచించడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. మై గౌవ్ నమో యాప్ ల ద్వారా ప్రజలు తమ సూచనలు చేయాలని లేదా 1800117800 నెంబర్ పై సందేశాన్ని రికార్డు చే సి పంపాలని ప్రధానమంత్రి సూచించారు. ఆకాశవాణి ద్వారా ప్రతి నెల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలతో తన మనసులోని ఆలోచనలను పంచుకొనే మన్ కి బాత్ ప్రసంగం ఈనెల 28వ తేదీన ప్రసారం అవుతుంది.

-------------------------

మైక్రోసాఫ్ట్ సేవల అంతరాయంతో భారతీయ ఆర్థిక వ్యవస్థ, నగదు చెల్లింపుల వ్యవస్థలు ప్రభావితం కాలేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ –ఆర్ బి ఐ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలోని 10 బ్యాంకులు, కొన్ని ఆర్థిక సంస్థలకు మాత్రమే స్వల్ప అంతరాయాలు కలిగాయాని, వాటిని కూడా పరిష్కరించినట్లు పేర్కొంది. భారత్ లో పనిచేస్తున్న బ్యాంకుల కీలక వ్యవస్థలు క్లౌడ్లో లేవని, కొన్ని బ్యాంకులు మాత్రమే క్రౌడ్క్ పరికరాలను ఉపయోగిస్తున్నాయని ఆర్ బి ఐ వెల్లడించింది.

-------------------------

భారత రక్షణ శాఖ వాయు సేనలో అగ్నివీర్–వాయు సేన ఉద్యోగాలకు ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల యువజన సంక్షేమాధికారి యు. శ్రీనివాసరావు తెలిపారు. జులై 3, 2004 నుంచి జనవరి 3, 2008 మధ్యలో జన్మించిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోపు agnipathvayu.cdac.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ ఏడాది అక్టోబరు 18వ తేదీ నుంచి రక్షణ శాఖ అధికారులు ఆన్లైన్లో అర్హత పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

=====================